# పరిమళించిన మానవత్వం

అప్పటిదాకా కబుర్లతో, నవ్వులతో సందడిగా వున్న ఆ వాతావరణం ఒక్కసారిగా నిశ్శబ్దం అయిపోయింది. అక్కడ కూర్చున్న స్టాప్ అంతా నోళ్ళు తెరిచి, కళ్ళు విప్పార్చి.. అక్కడ అడుగుపెట్టిన వ్యక్తివైపు వింతగా చూడసాగారు.

వారం రోజులు సెలవు తరువాత ఆరోజే ఆఫీస్‌కి వచ్చిన రహీంభాయ్... మామూలుగా.. చాలా మామూలుగా తన విధి నిర్వహణలో జొరపడ్డాడు.

అదే లాల్చీ పైజామా.. మాసిన గడ్డం.. తైల సంస్కారం, ఎరుగని జుట్టు... అతని వేషదారణలోగానీ, ప్రవర్తనలో గానీ కొత్తదనం ఏమీ కనిపించలేదు. ఎప్పట్లాగే అందరి టేబుల్స్ తుడిచి.. కూజాల్లో నీళ్ళు నింపి పెట్టి ఫోన్‌లు.. ఇంటర్‌కంలు తుడుస్తూ వున్నాడు. కాకపోతే రోజూ అందరికన్నా ముందొచ్చే అతనీవాళ కొంచెం ఆలస్యంగా వచ్చాడు. అదొక్కటే కొత్తదనం.

''కొత్త పెళ్ళి కొడుకు కదా! టీ తెమ్మంటే తెస్తాడా?'' నా కోలీగ్ శైలజ రహస్యంగా అడిగింది నన్ను. నేను చిరునవ్వు నవ్వి ''చెప్పిచూడు'' అన్నాను. శైలజ చాలా కొంటెపిల్ల. నెమ్మదిగా, అల్లరిగా పిలిచింది.. ''కొ.పె.కొ.''

''డోంట్ బి సిల్లీ శైలూ..'' అన్నాను వస్తున్న నవ్వు ఆపుకుంటూ..

ఇంతలోకే.. హెడ్ క్లర్క్ రావు ''రహీం భాయ్...'' అని పిల్చాడు.

క్రిందపడిన కాగితం ముక్కలు.. గుండు సూదులు ఏరి బుట్టలో పడేస్తోన్న రహీం బుట్ట క్రింద పెట్టేసి రావు దగ్గరికెళ్ళాడు.

''ఛాయ్ లాతే..''

రహీమ్ నిశ్శబ్దంగా వెళ్ళి ఓ మూల టేబుల్ మీద పెట్టిన ఫ్లాస్క్ తీసుకుని డబ్బుకోసం తిరిగి, రావు దగ్గరి కొచ్చాడు.

రావు జేబులోంచి ఐదు రూపాయల నోటు అతనికిచ్చాడు. రావుపక్కనే వున్న గోవిందం కన్నుగీటుతూ, రహస్యంగా అడిగాడు ''కొత్త జీవితం ఎలా వుందోయ్..'' రహీంబాయ్ మాట్లాడలేదు.

తల వంచుకుని, ఫ్లాస్క్ చేత బుచ్చుకుని బైటికెళ్తున్న రహీంను చూస్తే నాకు జాలేసింది.

సూర్యచంద్రులైనా గతి తప్పొచ్చేమో కానీ.. రహీం మాత్రం ముప్ఫై సంవత్సరాలుగా ఒకే పద్ధతిని అనుసరిస్తూ, ఒకే ఆఫీసులో పని చేస్తున్నాడు. అతను ఓల్డ్ సిటీలో ఎక్కడో వుంటున్నాడు. నేను ఆఫీసులో చేరి ఐదేళ్ళయింది. అప్పట్నించీ రహీమ్‌తో ఓ చిత్రమైన అనుబంధం ఏర్పడింది.

నెమ్మదిగా.. విధేయంగా వుంటూ ఎవరే పని చెప్పినా, విసుక్కోకుండా చేస్తూ తన పనేదో... తనేదోగా గడిపేస్తుంటాడు... ఆఫీసు పనివేళలకి ఓ పది నిమిషాలు ముందుగానే వస్తాడు. పదిహేను నిముషాలు ఆలస్యంగా వెళ్తాడు.

ఆ ఆఫీసుని తన స్వంత ఇంటికన్నా జాగ్రత్తగా, శుభ్రంగా కాపాడుతుంటాడు. అతని కోసం ఎప్పుడూ ఎవరూ రారు. అతనెక్కడికీ వెళ్ళడు. ముప్ఫై ఏళ్ళ సర్వీసులో అతను లీవ్ తీసుకుంది ఐదు సార్లు అంటారు సీనియర్స్.. అదేమోగానీ నేను చేరిన ఐదేళ్ళలో ఇదే మొదటిసారి అతను వారం రోజులు లీవ్ తీసుకోవడం.

అతను ఏ ఏ సందర్భాల్లో లీవు తీసుకున్నాడో ముకుందానికి బాగా తెలుసు. ఆయన మా సెక్షన్ సూపరిడెంటెండ్.. పాతికేళ్ళ సర్వీసుంది. రహీమ్ ఆటోబయోగ్రఫీ అంతా అతను చాల ఆసక్తిగా తెలుసుకుంటాడు. రహీమ్‌కి పిల్లల్లేరు.. అతనికి పదహారేళ్ళ వయసుకే పెళ్ళయిందిట.. పదేళ్ళు కాపురం చేశాక పిల్లల్లేరని రెండో పెళ్ళి చేసుకున్నాడు. ఆమెతో పన్నెండేళ్ళు కాపురం చేశాడు. దురదృష్టం అక్కడా ఎదురైంది. ఈలోగా మొదటి భార్య క్యాన్సర్ వ్యాధితో మరణించింది. రెండో భార్య అనారోగ్యం పాలైంది.

పిల్లలకోసం యాభై ఏళ్ళ వయసులో రహీం మూడో పెళ్ళి చేసుకున్నాడు. అయితే పెళ్ళైన ఏడాదికే ఆమె చనిపోయింది. ఇదంతా నేను ఆఫీసులో జాయిన్ అవకముందు జరిగిన కథ. నేను చేరాక తెల్సిన విషయం.. రహీమ్ భార్య పోయిందని ఓ రోజు ఆఫీసుకి రాలేదు అతను.. అంతే ఆ

తరువాత ఎప్పుడు అతను లీవ్ పెట్టలేదు.

అక్కడ మగవాళ్ళంతా రహీమ్ పెళ్ళిళ్లకీ, చావులకీ మాత్రమే లీవ్ పెడతాడని అతని మీద జోకులేస్తుంటారు.

అతనిని సరదాగా అప్పుడప్పుడూ కృష్ణపరమాత్మ అని పిలుస్తుంటారు. అష్ట భార్యలై పోయారా అని అడుగుతుంటారు.

అదంతా కొత్తల్లో నాకు వింతగా అన్పిస్తుండేది. రాను రాను నేనూ అలవాటుపడ్డాను. అతణ్ణి చూస్తే ఎందుకో తెలీదుగానీ.. ఓ మహర్షిలా కనిపిస్తాడు నాకు. కానీ ఆ మహర్షి నాలుగు పెళ్ళిళ్ళు చేసుకున్నాడంటే ఎవరూ నమ్మకపోవచ్చు. అయితే అది మాత్రం నగ్న సత్యం.

మూడో భార్య చనిపోయిన రెండేళ్ళకి.. ఈ మధ్యే రహీమ్ నాలుగో పెళ్ళి చేసుకున్నాడు. ఇంకో ఏడాదితో రిటైర్ అవబోతూన్న అతను నాలుగో పెళ్ళి చేసుకోవడం మా ఆఫీసులో పెద్ద సంచలనం సృష్టించింది. ఎగతాళి చేసే వాళ్ళు.. చీదరించుకునే వాళ్ళు.. కోపంతో మండిపడ్డవాళ్ళు, ఇలా అనేక రకాల మనుషుల్నీ.. ఆ వాతావరణాన్ని మౌనంగా స్వీకరించాడు అతను.

అన్నిట్లోకి చిత్రం ఏవిటంటే నాలుగో భార్య వయసు 30. తనకన్నా వయసులో అంత చిన్నదైన ఆమెని ఎందుకు చేసుకున్నాడో అర్థం కావడం లేదు నాకు.. పైగా ఆమె కనీసం విడో కానీ డైవర్స్ కానీ కాదు అవివాహిత అని విన్నాను. అతనికి వివాహం అవసరం అనిపిస్తే ఏ విడోనో చేసుకోవచ్చు కదా! అనిపించింది.

'' ఇంకా రహీమ్ గురించే ఆలోచిస్తున్నావా?'' శైలు అడిగింది.

నేను నవ్వేసి ఫైల్సులో తలదూర్చేశాను. రోజులు మామూలుగానే గడుస్తున్నాయి. రహీమ్ ఎప్పట్లాగే పది నిమిషాలు ముందుగా ఆఫీసుకు వస్తున్నాడు. అందరూ వెళ్ళిపోయిన పావుగంటకి అన్ని తాళాలు వేసి వెళ్ళిపోతున్నాడు. అతను రోజూ ఆరుమైళ్ళు నడుస్తాడు.

ఎప్పుడన్నా ఒకసారి సైకిల్ మీద వస్తాడు. ఆ సైకిల్ చాలా పాతకాలం నాటిది. అతను సర్వీసులో చేరిన ఐదేళ్లకి సైకిల్ లోన్ తీసుకుని కొనుక్కున్నాడట. పాడవుతున్న సైకిల్‌ని అస్తమానం రిపేర్లు చేయిస్తూనే వుంటాడు. ''పిల్లా జల్లా లేరు.. డబ్బు ఏంచేస్తాడో? కొత్త సైకిల్

కొనుక్కోవచ్చుగా? అంటుంటాడు ముకుందం.

అతని సైకిలు, అతను తొడుక్కునే దుస్తులు.. అతని తీరు.. అతనెంతో జాగ్రత్తపరుడు అన్న విషయం తెలుస్తుంది. కానీ కొందరు అతనిని ''పిసినారి'' అంటుంటారు.

కానీ, నాకు మాత్రం అతను చాలా జాగ్రత్తపరుడు అనిపిస్తుంది.

కొన్ని రోజులు గడిచాయి.

అనుకోకుండా నా పెళ్ళి నిశ్చయమైంది. పెళ్ళిచూపులు.. నిశ్చితార్థం.. ముహూర్తం నిశ్చయించడం అన్నీ చకచకా నెలరోజుల్లో పూర్తయ్యాయి. నా పెళ్ళికి ఆఫీసు మొత్తం కదలివచ్చినట్టనిపించింది.

సూత్ర ధారణ.. తలంబ్రాలు.. మొదలైన కార్యక్రమాలు పూర్తయ్యాయి.. ఆహూతులంతా ఒక్కొక్కరే బహుమతులందచేస్తూ నన్నాశీర్వదించసాగారు. అందర్నీ ఆశ్చర్యంలో.. నన్ను ఆనందంలో ముంచేసే చిన్న సంఘటన జరిగింది.

కొంచెం పరిశుభ్రమైన బట్టలతో నా దగ్గరకు వచ్చి.. తన చేతుల్లో వున్న వెండి కుంకుమ భరిణి నాకందించి..'' సదా సుఖీరహో బేటీ..'' అని దీవించాడు రహీం..

నేను అతనిచ్చిన బహుమతి చూసి నిశ్చేష్టురాల్ని అయ్యాను.. కుంకుమ విలువ తెలీని.. కుంకుమ వాడకం గురించి తెలీని రహీం నాకు కుంకుమ భరిణి.. అదీ వెండిది ఇవ్వడం.. నన్ను ''బేటీ'' అని సంబోధించడం.. నాకసలు అర్థం కాలేదు.. అది కలా! నిజమా! అనుకున్నాను. అతని కళ్ళల్లోనా పట్ల కన్పిస్తోన్న వాత్సల్యం.. అది నిజమే అనిపించింది.

మిగతా స్టాఫ్ అంతా కలిసి నాకు ఒక ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్ ప్రెజెంట్ చేశారు.

నేను, మావారితో కలిసి హనీమూన్ వెళ్ళి పోయాను. పదిహేనురోజులు మేమిద్దరం తిరుపతి, మద్రాసు, మైసూరు, బెంగుళూరు అన్నీ హాయిగా తిరిగాం. నా భర్త అనురాగ జలధిలో నాకు నా ఆఫీసుకానీ, ఫ్రెండ్స్ కానీ.. అమ్మా.. నాన్నా.. చెల్లెలు.. తమ్ముడు ఎవరూ అంతగా గుర్తు రాలేదు.. కానీ నేను కొన్నిచోట్ల దేవాలయాలు సందర్శించినప్పుడు కుంకుమ నుదుట పెట్టుకునేటప్పుడు రహీం గుర్తొస్తుండేవాడు. నాకు కుంకుమ భరిణి ఇవ్వాలన్న

ఆలోచన అతనికెలా కలిగిందబ్బా.. ఎవరైనా సలహా ఇచ్చి వుంటారా?.. ఒక వేళ సలహాయిచ్చి వుంటే అది ఎవరై వుంటారు! అని కొంచెం సేపు ఆలోచించసాగాను.

'' ఇంకా కొన్నాళ్ళు ఇలాగే తిరుగుదామా?'' అన్నారు మావారు. మైసూర్‌లో వున్నప్పుడు..

'' ఆఫీసుకి పదిహేను రోజులే రానన్నాను. మళ్ళీ లీవ్ ఎక్స్‌టెండ్ చేయాల్సి వస్తుంది.'' అన్నాను.

''నేనూ అదే పని చేయాలి.. కానీ ఎలా? దిగులుగా అన్నారు.

'' ఏం?''

'' ఏం లేదు.. రెండ్రోజుల్లో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగుంది. లీవ్ ఇవ్వరు. పోనీ ఓ పని చేద్దాం..'' కుతూహలంగా చూశాను.

''రెణ్ణెల్లాగి మళ్ళీ ఓ పది రోజులు సెలవు పెట్టేసి ఢిల్లీ, ఆగ్రా వెళ్దాం..''

'' ఒ.కె.'' సంతోషంగా ఒప్పుకున్నాను.

నాకెందుకో రహీం గుర్తొచ్చాడు. ముప్పై ఏళ్ళ సర్వీసులో పట్టుమని పదిరోజులు లీవ్ పెట్టకుండా ఎలా వుండగలిగాడబ్బా?

'' ఏవిటాలోచిస్తున్నావ్''? అడిగారాయన

'' ఏం లేదు. మా ఆఫీసులో ఒక ప్యూన్ వున్నాడు. అతని గురించి ఆలోచిస్తున్నాను.''

'' ఏవిటతని స్పెషాలిటీ''

నవ్వాను. ''రోజూ స్నానం చేసి పరిశుభ్రమైన డ్రెస్ వేసుకోకపోవడం.. డ్యూటీకి టైమ్ ప్రకారం రావడం, లీవ్‌లు తీసుకోకపోవడం.. అన్నిటికన్నా ముఖ్యమైనది నాలుగు పెళ్ళిళ్ళు చేసుకోవడం..''

''వ్వాట్! నలుగురు భార్యలా అతనికీ?

పకపకా నవ్వాను. ఆయన భయానికి..''

కాదు మిగతా ముగ్గురూ పోయార్ట. పిల్లలకోసం.. ఈ మధ్యే నాలుగో పెళ్ళి చేసుకున్నాడు. మీకో విషయం తెలుసా! ఎప్పుడూ పైసా ఖర్చు పెటుకోని

మా రహీమ్ నాకు వెండి కుంకుమ భరిణి ప్రెజెంట్ చేశాడు.

'' ఈజిట్.. నువ్వంటే చాలా అభిమానం అన్నమాట.. నిజానికి అది చాలా విలువైన బహుమతి.. జాగ్రత్తగా దాచావా?''

'' ఊ.. అమ్మ దగ్గర ఉంది. మనం తిరిగి వెళ్ళాక తీసుకుంటాను.''

''కొందరు చాలా తమాషాగా అన్పిస్తారు. వాళ్లకి కోపం ఎప్పుడొస్తుందో ఎందుకొస్తుందో తెలీదు. అలాగే ప్రేమకూడా.. మా ఇంటి దగ్గర ఒక పిచ్చతను ఉండేవాడు. అతణ్ణిచూసి అందరూ అసహ్యించుకునేవాళ్ళు. కానీ అతను నా పట్ల చాలా ప్రేమగా వుండేవాడు''

''పాపం రహీం పిచ్చివాడు కాదండీ. చాలామంచివాడనిపిస్తుంది నాకు..''

''పిచ్చిదానా''.. చాలా మంచివాళ్ళనే పిచ్చివాళ్ళనేది.. తెలీదా!

నేను చకితురాల్నయ్యాను.

తరువాత అమ్మకి, చెల్లాయికి చీరలు కొనుక్కొని, శాండల్ పౌడర్.. స్ప్రే వగైరా కొనుక్కొని రూమ్‌కెళ్ళిపోయాం.

మేము హైదరాబాద్ చేరి... ఇద్దరం ఆఫీస్‌ల కెళ్ళిపోయాం. నేను డ్యూటీలో చేరిన రెండ్రోజులు రహీం రాకపోవడం చూసి శైలునడిగాను.. ''రహీం రావటంలేదా?''

శైలు నవ్వింది.. ''నీకు, రహీంకి అవి నాభావ సంబంధం వున్నట్టుందే.. అర్ధ రూపాయి పెట్టి బన్ కూడా కొనుక్కొని తినని రహీం నీకు వెండి కుంకుమ భరణి ప్రెజంట్ చేయడం.. నీకతనిమీద వున్న అభిమానం... బాగుంది అవునూ.. ఆబరిణి అతనిలాగే కంపుకొడుతోందా?''

''చాల్లే శైలూ.. ఊరుకో.. అతనూ మనిషే కదా!... ప్రతిదానికలా విమర్శించకూడదు. ఎన్నడూ లీవ్ తీసుకోని వాడు మూడు రోజుల నుండి రావడం లేదంటే.. ఏమైందో తెలుసుకోవడం మన ధర్మం..''

'' ఏం వుందీ, నాలుగో ఆవిడ కూడా టపాకట్టేసిందేమో''

''ఛ.. నిన్నడగడం నాది బుద్ధి తక్కువ... కోపంగా అన్నాను.

పది రోజుల తర్వాత రహీం ఆఫీసుకొచ్చాడు. ఎప్పటిలాగే చాలా మామూలుగా వున్నాడు. టేబుల్ తుడవడం.. కూజాల్లో నీళ్ళు నింపడం.. అడిగిన వాళ్ళకి టీ తెచ్చివ్వడం.. అంతా యధాప్రకారం చేశాడు.

ఎవరూ కూడా అతణ్ణి ఇన్ని రోజులెందుక్కు రాలేదు అని అడగలేదు. ఐదో పెళ్లి అయిందేమో అని ఊహిస్తూ కూర్చున్నారు.

లంచ్ టైమ్ అయింది.

శైలు లంచ్ కి బైటికెళ్ళింది తన బాయ్ ఫ్రెండ్‌తో

నేను ఒంటరిగా కూర్చుని లంచ్ చేస్తున్నాను.

రహీం గాజు గ్లాసుతో నీళ్ళు తీసుకొచ్చి నా టేబిల్‌మీద పెట్టాడు. అడక్కుండా నీళ్ళిచ్చిన అతడివైపు కృతజ్ఞతగా చూశాను.

''బేటీ నీ లంచ్ అయిం తరువాత నీతో కొంచెం మాట్లాడాలి'' అన్నాడు రహీం.

అతని నోటినుంచి, బట్టలనుంచి వ్యాప్తిస్తోన్న వాసనకి మొహం తిప్పుకున్నాను.. కొద్దిగా తలపక్కకి తిప్పి ''సరే..'' అన్నాను.

అతను వెళ్ళిపోయి దూరంగా స్టూల్ మీద కూర్చున్నాడు.. ఇంకా అతని శరీరం నుంచి.. వ్యాపించిన దుర్గంధం అక్కడ తచ్చాడు తున్నట్టనిపించింది నాకు.. అతనిచ్చిన నీళ్ళు తాగాలనిపించలేదు. ఎలాగోలా లంచ్ పూర్తిచేసి , చేతులు కడుక్కొని.. మళ్ళీ మంచి నీళ్ళు తెచ్చుకున్నాను.

నేను నా సీటులో కూర్చోగానే రహీం వచ్చాడు.

''చెప్పు రహీం... ఏదోమాట్లాడాలన్నావు.'

త్వరగా అతణ్ణి అక్కడ్నించి పంపేయాలన్న ఉద్దేశ్యంతో అన్నాను.

నేను పదిరోజులు దఫ్తర్‌కి రాలే కదా..! భీమార్ అయినుంటి'' అన్నాడు.

''అలాగా! ఏమైంది? ఏవిటి జబ్బు?..'' అన్నాను.

''సడన్‌గా చక్కరొచ్చి పడిపోయిన.. డాక్టర్ తానకి బోయిన దవాఖానల షరీకు చేసిండు.. మస్తు పైసలయినయి ఫీజులకు మందులకు''.

''అలా లెక్క చూసుకుంటే ఎలా రహీం.. మనిషన్నాక రోగాలొస్తయి.. డాక్టర్లు.. మందులు.. అన్నీ మామూలే..''

రహీం కొన్ని క్షణాలు ఏం మాట్లాడలేదు.. తర్వాత కొంచెం జీరబోయిన గొంతుతో అన్నాడు.. ''బేటీ.. నా పానం బిల్‌కుల్ ఖరాబైంది. రిటైర్‌మెంట్ దాకా బతికుంటనో... లేనో! నాకొక హెల్ప్ చేయాలె.''

'' ఏవిటా హెల్ప్ రహీం.. చెప్పు''

'' ఏం లే బేటీ.. నా పి. ఎఫ్.. ఎల్. ఐ.సి. పెన్షన్ అన్నింటికి వా భార్య పేరు లక్ష్మి.. ఆమె పేరు రాయాలి..''

''అలా ఎందుకు రహీం.. ఓసారే రిటైర్ అయ్యాక అన్ని డ్రా చేసి ఇవ్వచ్చులే. అంతగా అయితే పెన్షన్‌కి నామినీగా ఆవిడ పేరు రాసేద్దాం.. అయినా ఏం ముంచుకుపోయిందని.. ఎందుకా మాటలు రహీంభాయ్'' అన్నాను ముక్కు మూసుకొంటూ.

అతను దీర్ఘంగా నిశ్వాస విడిచి అన్నాడు.

''నాకు బిడ్డలు లేరు.. ముగ్గురు భార్యలు సచ్చిపోయిన్రు.. నాకెవరు లేరు.. నా తరువాత నా ఇల్లు.. ఈ డబ్బు అంతా ఎవరికివ్వాల?.. ఒక దినం.. ఒకామె.. మూసీనదిలో దూకుతుంటే నిలబెట్టిన.. పాపం ఆమెకి నా లెక్కనే ఎవరూలేరంట.. తినడానికి తిండిలేక.. నిలువనీడలేక పరేషాన్‌లో ఉండె..అందుకే నాతో తీస్కబోయిన.. కానీ బిడ్డా.. ఈ లోకం ఆడోల్లనీ.. మగోల్లనీ ఒక్క తాన వుండనిస్తాది.. లైసెన్స్ కావాల కదా! అందుకే నిఖా చేసుకున్నా. ఆమెకి నేను పోయినంక నా ఈ నౌకరీ.. ఈ పైసలు ఇప్పిస్తే చాలు.. ఎందుకంటే ఆమె వయసు చిన్నది.. ఇంకా చాలాకాలం బతకాలె.

నేను నిశ్చేష్టురాల్నయ్యాను.. ఇతను అక్షరం ముక్కరాని మామూలు ప్యూనే.. ఇతని హృదయం ఎంత విశాలం! ఆలోచనలు ఎంత ఉన్నతం!.. హిమాలయపర్వతంలా ఎంతో ఎత్తుకు ఎదిగి కన్పిస్తోన్న రహీంని అలాగే చూస్తుండిపోయాను.

'' ఆమె నీలెక్కనే హిందువు.. అందుకే నీకు బొట్టు డబ్బ ఈయమని చెప్పింది నాకు'

కథా నిలయం
5082

మరోసారి షాక్ తగిలింది నాకు..

ఇంత ఔన్నత్యం నింపుకున్న ఇతనినా ఇంతకాలం అంతా విమర్శించింది.. ఏ కొలమానం వుంది ఇతని ఔదార్యం కొలవడానికి! నాలుగో పెళ్ళి.. నాలుగో పెళ్ళి అని అందరూ ఎగతాళి చేశారు.. నాలుగో పెళ్ళి ఎందుకు చేసుకున్నాడో.. అర్థమైంది.. పిల్లలు.. బంధువులు ఎవరూలేరని అతను, తనకి ముందూ, మునుపూ పరిచయంలేని.. ఎన్నడూ తాను చూడని ఎవరో అనాథ, జీవితం మీద విరక్తితో తనువు చాలించబోతుంటే రక్షించి.. రక్షణ కల్పించి.. తనకున్న కొద్దిపాటి ఆస్తిపాస్తులకి ఆమెను వారసురాల్ని చేయాలనుకుంటున్నాడు. కులం, మతం, ఆచారం.. ఏదీ అతని విశ్వాసాన్ని, అతని నిర్ణయాన్ని సడలించలేవు. తనని అవమానించిన.. అవహేళన చేసిన.. తనని చూసి నవ్విన.. పరిహసించిన.. ఈ సమాజం పశ్చాత్తాపంతో తలవంచుకునేలా అతను తీసుకున్న ఈ నిర్ణయం.. ఎంత గొప్పది!

నాకిప్పుడు రహీం వంటినుంచి, నోటి నుంచి కూడా ఎలాంటి దుర్గంధం రావడం లేదు.. పరిమళించిన మానవత్వపు సుగంధం జగమంతా వ్యాపిస్తున్నట్లనిపించింది.

విశాలాంధ్ర
తేది 10-8-97